# సాక్షి
## కుమురం భీం

శనివారం : 22 : ఏప్రిల్ : 2023






**అకాల వర్షంతో అతలాకుతలం**
అకాల వర్షం అన్నదాతలకు తీరని నష్టం మిగిల్చింది. చేతికొచ్చిన వరి దెబ్బతినగా, మామిడికాయలు నేలరాలాయి.
IIలో▸



**రంజాన్‌కు ముస్తాబు**
జిల్లాలోని ఈద్గాలు రంజాన్ వేడుకలకు ముస్తాబయ్యాయి. శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.
IIIలో▸

గరిష్టం/కనిష్టం
39.5 /24.7

**వాతావరణం**
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. భానుడి ప్రతాపం కొనసాగుతుంది. వేడి అధికంగా ఉంటుంది. సాయంత్రం వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రెగ్యులరైజ్ చేయాలని వినతి
**ఆసిఫాబాద్:** జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. నాలుగు సంవత్సరాలుగా విధుల్లో ఉన్న తమను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణ తదితరులు ఉన్నారు.

### మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ఆసిఫాబాద్:** పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సిర్పూర్(యూ) మండలంలోని కోహినూరు బి, రాఘపూర్, శెట్టి హడపనూర్ గ్రామ పంచాయతీల్లో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కోహినూర్ బి పంచాయతీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.


### నేటి నుంచి సమ్మర్ స్పార్కిల్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

**ఆసిఫాబాద్:** జిల్లాలోని గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలికల కోసం ఈ నెల 22 నుంచి మే 6 వరకు సమ్మర్ స్పార్కిల్స్– 2023 శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల గన్నారంలో ఈ నెల 22 నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరాల్లో క్రాఫ్ట్, మ్యూజిక్, వేదిక్, మాథ్స్, థియేటర్, ఆర్ట్స్ అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాలోని 3 సాంఘిక సంక్షేమ పాఠశాలలు, 2 గిరిజన సంక్షేమ పాఠశాలలు, 2 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్సీవో స్వరూపారాణి, ప్రిన్సిపాళ్లు సంగీత, రమ్యకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

### బండి సంజయ్‌ని కలిసిన జిల్లా నాయకులు




బండి సంజయ్‌తో జిల్లా బీజేపీ నాయకులు

**ఆసిఫాబాద్:** జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రెబ్బెన మండలం గోలేటి ఖైరిగూడ ఓపెన్ కాస్టు డ్రైవర్ల సమస్యను బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్ జాడె, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, శ్రీధర్, సంపత్, తిరుపతి, నాగేశ్, చంద్రశేఖర్, కుమార్, సుధాకర్ ఉన్నారు.

### 25న మెగా జాబ్‌మేళా
**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల (కోర్టు ఎదురుగా) మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 40కి పైగా ప్రైవేట్ కంపెనీల్లో సుమారు 3,500 వరకు పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హ్యాపీ మొబైల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, అపోలో ఫార్మసీ, డిమార్ట్, రిలయన్స్, జియో మార్ట్, ముత్తుట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు.

# అవినీతిపై కొరడా!



- పరిపాలనపై పట్టు బిగించిన కలెక్టర్
- ప్రభుత్వ శాఖల్లో ప్రక్షాళన
- తహసీల్దార్ల బదిలీలతో షురూ
- తాజాగా జిల్లా పంచాయతీ అధికారి సరెండర్

**సాక్షి, ఆసిఫాబాద్/ఆసిఫాబాద్:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అవినీతితో కంపుకొడుతున్న వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రక్షాళన మొదలైంది. ఫిబ్రవరి 10న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్కడే తొలుత జిల్లా అధికారుల పనితీరుపై దృష్టి సారించారు. ఏయే శాఖల్లో అవినీతి బాగా జరుగుతోందన్న అంశంపైనా ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ముఖ్యంగా అవినీతి అధికారుల చిట్టాను రూపొందించి వారి కార్యకలాపాలపై ఆరా తీసి.. చర్యలకు ఉపక్రమించారు. మూడు నెలల్లోనే పరిపాలనపై పూర్తిస్థాయి పట్టు సాధించడంపై ఇటు ప్రజల్లో, అటు ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మొన్న రెవెన్యూ శాఖలో ఏళ్లపాటు పాతుకుపోయి అవినీతికి అలవాటు పడ్డ కొందరు అధికారులపై కొరడా ఝుళిపించగా.. తాజాగా జిల్లా పంచాయతీ అధికారిని ఏకంగా ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇప్పటికే 30 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారన్న ప్రచారం నేపథ్యంలో తర్వాత వంతు ఎవరిదో అన్న చర్చ ఉద్యోగవర్గాల్లో జరుగుతోంది. కలెక్టర్ చర్యలతో ప్రధానంగా అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

**రెవెన్యూ శాఖతో మొదలు..**
కలెక్టర్ కంటే ముందుగా సెంట్రల్ పోలీసు విభాగంలో అసిస్టెంట్ కామాండెంట్ హోదాలో పనిచేసిన అనుభవం ఉన్న హేమంత్ బోర్కడేకు నిక్కచ్చి అధికారి అనే పేరుంది. కుమురంభీం జిల్లా కలెక్టర్‌గా వచ్చాక ఇక్కడా తనదైన శైలిలో మార్పునకు శ్రీకారం చుట్టారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో అయనే స్వయంగా ప్రజల నుంచి అర్జీలు తీసుకుని వారి సమస్యలు వింటూనే ఆయా శాఖల్లో అధికారుల నిర్లక్ష్యం.. పనితీరుపై అంచనాకు వచ్చారు. వివిధ మార్గాల్లో సేకరించిన సమాచారం మేరకు తొలుత రెవెన్యూ శాఖలో ఏళ్లుగా పాతుకుపోయి, అవినీతికి పాల్పడుతున్న కొందరు తహసీల్దార్లపై బదిలీ వేటు వేశారు. గతంలో అనేక అవినీతి ఆరోపణలపై సెలవుపై వెళ్లిన ఓ రెవెన్యూ అధికారి ఇటీవల మళ్లీ తనకు పోస్టింగ్ ఇప్పించమని కలెక్టర్‌ను కోరగా.. ఆయన ససేమిరా అనడం పరోక్షంగా అవినీతి అధికారులను తాను ఉపేక్షించబోమన్న సంకేతం వెళ్లింది.

**ఇన్‌చార్జీల పాలన.. అవినీతి ఆరోపణలు**
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా ఏర్పాటు నుంచీ రెగ్యులర్ డీపీవోను నియమించలేదు. డీఎల్‌పీవోలుగా పనిచేస్తున్న వారికే జిల్లా పంచాయతీ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ డీఎల్‌పీవోగా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్ ఇన్‌చార్జి డీపీవోగా, జెడ్పీ డిప్యూటీ సీఈవో, ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. గ్రామ పంచాయతీలను పర్యవేక్షించడంలో ఇన్‌చార్జి అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో జిల్లా కేంద్రంలోనూ నెలల తరబడి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదు. జెడ్పీ సర్వసభ్య సమావేశంల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మితోపాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మిషన్ భగీరథ శాఖ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఇన్‌చార్జి డీపీవోలుగా పనిచేసిన వారిపై గతంలో అవినీతి ఆరోపణలు కూడా వచ్చాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన డీపీవో శ్రీకాంత్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్ విషయంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆయనను సరెండర్ చేసిన విషయం విధితమే.

**డీపీవో రమేశ్ సరెండర్..**



జి.రమేశ్

గత కలెక్టర్ హయాంలో తనదైన హవా నడిపిన జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జి.రమేశ్ పనితీరుపై ఇటీవల కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులతోపాటు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆదేవిధంగా ఆయన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ముఖ్యంగా మార్చి నెలలో పూర్తి కావాల్సిన సీసీ రోడ్డు పనులు పలు పంచాయతీల్లో మొదలెట్టలేదు. ఈ పనులకు సంబంధించి పనిచేసే కూలీలకు, కాంట్రాక్టర్లకు ఆన్‌లైన్ ద్వారా పంచాయతీ నుంచి డబ్బులు చెల్లించాలి. డీపీవో నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్ సైట్ మార్చి 17 నుంచి ఏప్రిల్ 18 వరకు పనిచేయకపోవడంతో ఈ నెల బెజ్జూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వేతనాలు, ఇతర చెక్కుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఇదే విషయంపై కలెక్టర్ డీపీవోకు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. శానిటేషన్ పనుల్లోనూ డీపీవో పర్యవేక్షణ లోపించింది. బెజ్జూర్‌లో పారిశుద్ధ్య కార్మికులు వేతనాల కోసం రోడ్డెక్కిన ఘటనపై ఈ నెల 18న 'సాక్షి' దినపత్రికలో ఇదేమి 'పంచాయితీ'! అనే కథనం ప్రచురితమైంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పైకారణాలు చూపుతూ గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడే డీపీవో జి.రమేశ్‌ను సరెండర్ చేస్తూ అతనిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్‌ను కోరారు. ఆయన స్థానంలో డీఆర్‌డీవో సురేందర్‌కు జిల్లా పంచాయతీ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఉదయం డీపీవో సరెండర్ విషయం తెలియడంతో కలెక్టరేట్‌లో చర్చనీయాంశమైంది.

## పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట



ధనోరాలో రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సక్కు, పక్కన కలెక్టర్ హేమంత్ బోర్కడే, తదితరులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ధనోరా, గుంనూర్ 'మన ఊరు–మన బడి' పాఠశాలలు ప్రారంభం

**కెరమెరి(ఆసిఫాబాద్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. కెరమెరి మండలం ధనోరా, లింగాపూర్ మండలం గుంనూర్ కె గ్రామాల్లో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలను శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీవో సుధాకర్, ఎంఎస్‌వో ప్రకాశ్, తహసీల్దార్ జమీర్, ఏఈ నజిమోద్దీన్, ఏవోలు సుభాశ్, భరత్, సత్తయ్య, గోయగాం కాంప్లెక్స్ హెచ్‌ఎం నల్లగొండ రమేశ్, ఎంపీపీ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీలు అబ్దుల్‌కలాం, ఆత్మారాం, సర్పంచులు చిలుక, జ్యోతిరాం, ఉప సర్పంచ్ రిజ్వాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రావు పాల్గొన్నారు.

**పల్లె ప్రకృతివనాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి**
**ఆసిఫాబాద్:** జిల్లాలోని పల్లె ప్రకృతివనాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎస్పీ అచ్చేశ్వర్‌రావుతో కలిసి పల్లెప్రకృతి వనాల నిర్వహణపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పల్లెప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల్లో లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మండలాలు, గ్రామాల వారీగా పల్లె, బృహత్ వనాల చిత్రాలను ప్రదర్శించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా ప్రజలను సురక్షితంగా తీసుకెళ్లి తీసుకువచ్చిన ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులను అభినందించారు. జిల్లా రవాణాశాఖ అధికారి గంధం లక్ష్మి, డీఆర్‌డీవో సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి సజీవన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

**రెబ్బెన(ఆసిఫాబాద్):** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున అన్నివిధాలా ఆదుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. షార్ట్ సర్క్యూట్‌తో నంబాలకు చెందిన పూదరి రాజయ్య ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా.. శుక్రవారం కాలిపోయిన ఇంటిని జెడ్పీ చైర్‌పర్సన్ పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని, ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో డబ్బులు, నగలతోపాటు కష్టపడి పండించిన పంట కాలిబూడిద కావడం బాధాకరమన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ సౌందర్య, సింగిల్ విండో చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్ చెన్న సోమశేఖర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, మురళీగౌడ్, శ్రీధర్, ఆనంద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

## ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం సాధించాలి

- అదనపు కలెక్టర్ రాజేశం
- కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష

**ఆసిఫాబాద్:** జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్ల లక్ష్యం సాధించాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డీఆర్వో రాజేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని వెల్లడించారు. వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు ఇతరత్రా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రతీ కేంద్రం వద్ద సుశిక్షితులైన వారిని ఇన్‌చార్జీలుగా నియమించాలన్నారు. జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. తూకం జరిగిన వెంటనే ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సంచులను కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో తారామణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, డీటీవో గంధం లక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హన్మంత్‌రావు, డీఆర్‌డీఏ అధికారి రామకృష్ణ, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు చిలువేరు సత్యనారాయణ, కాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా అధికారులు

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్

**ఆసిఫాబాద్‌అర్బన్:** స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాలపై అవగాహన పెంచుకుంటూ ప్రజలకు చేరువకావాలని సూచించారు. కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో గస్తీ వాహనాలను నిరంతరం తిప్పాలన్నారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీఐ రాజాప్రతాప్, ఎస్సైలు రమేశ్, సందీప్, గంగన్న, రాజేశ్వర్, రమన్‌కుమార్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

## వీఓఏల నిరసన

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీఓఏలు శుక్రవారం వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. వీఓఏల సంఘం గౌరవ అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ వీ ఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోడం దారుణమన్నారు. జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు రమ, సుదర్శన్, సంజీవ్, సరిత, స్వప్న, ప్రియ, కవిత, మహేశ్ పాల్గొన్నారు.



# అసౌకర్యాల 'కేంద్రాలు'!



ఈ ఫొటోలో కనిపిస్తోంది వాంకిడి మండలం నవేగాం(గడెమార్గ)లోని అంగన్‌వాడీ కేంద్రం. పక్కా భవనం లేకపోవడంతో స్థానికంగా ఉన్న ఓ ఇంట్లోనే నిర్వహిస్తున్నారు. నెలనెలా అద్దె చెల్లిస్తున్నా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సామగ్రి పెట్టుకునేందుకు కూడా స్థలం సరిపోవడం లేదు. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఫ్యాన్లు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఉక్కపోతతో తల్లడిలుతున్నారు.



వాంకిడి మండలం లక్ష్మీపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- అంగన్‌వాడీ సెంటర్లలో కానరాని వసతులు
- ఇరుకు గదులు, అద్దె భవనాలతో ఇక్కట్లు
- విద్యుత్ కనెక్షన్లు లేక ఉక్కపోత
- పట్టించుకోని అధికారులు

**వాంకిడి(ఆసిఫాబాద్):** జిల్లాలో 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఎండతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలకు తిప్పలు తప్పడం లేదు. మారుమూల గ్రామాల్లో నేటికీ వసతులు లేని అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో సెంటర్లను నిర్వహిస్తున్నారు. దీనికితోడు విద్యుత్ సౌకర్యం లేక ఫ్యాన్లు ఏర్పాటు చేయలేదు. మరుగుదొడ్లు అందుబాటులో లేక టీచర్లు, బాలింతలు, గర్భిణులు ప్రతీసారి బయటికి వెళ్లి రావాల్సిన దుస్థితి.

**973 అంగన్‌వాడీ కేంద్రాలు..**
జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు వాంకిడి, జైనూర్, కాగజ్‌నగర్, సిర్పూర్, ఆసిఫాబాద్‌ల పరిధిలో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 139 మినీ కేంద్రాలు ఉన్నాయి. 890 మంది అంగన్‌వాడీ టీచర్లు, 733 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 303 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 374 కేంద్రాలు స్థానికంగా ఉన్న పాఠశాల భవనాలు, కమ్యూనిటీ సెంటర్లలో నిర్వహిస్తున్నారు. సుమారు 120 కేంద్రాల్లో మాత్రమే విద్యుత్ సౌకర్యం ఉంది. మిగిలిన చోట్ల విద్యుత్ సౌకర్యం లేదు. ఇటీవల 175 కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టినా విద్యుత్, మరుగుదొడ్ల ఏర్పాటుపై సంబంధిత అధికారులు దృష్టి సారించలేదు.

| జిల్లా వివరాలు | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు | 973 |
| గర్భిణులు | 4,858 |
| బాలింతలు | 5,227 |
| చిన్నారులు | 49,617 |

**తప్పని ఇక్కట్లు..**
అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలు, ఇరుకు గదుల్లోనే కొనసాగుతుండటంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అద్దె భవనాలకు రూ.2 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.4 వేల చొప్పున ప్రభుత్వం అద్దె మంజూరు చేస్తోంది. అయితే సరైన భవనాలు దొరక్కపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రేకుల షెడ్లు, పెంకుటిళ్లలో కొనసాగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం చెల్లించే అద్దెకు భవనాలు దొరకడం లేదు. ఇరుకు కేంద్రాల్లో ఆట సామగ్రి, ఆహార పదార్థాలు నిల్వ చేయడం కష్టంగా మారింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### ఉక్కపోత భరించలేకపోతున్నాం



లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. విద్యుత్ కనెక్షన్ లేదు. పెరిగిన ఎండలకు ఉక్కపోత భరించలేకపోతున్నాం. గ్రామంలో పక్కా భవనం నిర్మించి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి. ఫ్యాన్లు ఏర్పాటు చేయించాలి.
– జ్యోతి, బాలింత, లక్ష్మీపూర్

### సదుపాయాలు కల్పించాలి



జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. పక్కా భవనాలు లేక సెంటర్ల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ సౌకర్యం కల్పించి ప్రతిచోటా మరుగుదొడ్లు నిర్మించాలి. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.
– అల్లూరి లోకేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

## క్లుప్తంగా

### ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడిగా తిరుపతి


తిరుపతి

తాండూర్: మండలానికి చెందిన పుల్లం తిరుపతి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) తెలంగాణ రాష్ట్ర సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతి క్రియాశీలకంగా పని చేస్తున్నారు. పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా బీజేపీ ప్రభుత్వం ఎఫ్‌సీఐ రాష్ట్ర సభ్యుడిగా అవకాశాన్ని కలిపించింది.

### అంతర్జాతీయ వుషూ టోర్నీకి నస్పూర్ వాసి


శివమహేశ్

నస్పూర్: రష్యాలోని మాస్కోలో మే 2 నుంచి 8వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ వుషూ పోటీలకు నస్పూర్‌కు చెందిన మాటూరి శివ మహేశ్ ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వుషూ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సతీష్, కార్యదర్శి రాజనర్సు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వుషూ ఫుల్ కాంటాక్ట్ ఫైట్ 52 కేజీల విభాగంలో శివ మహేశ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### మాలమహానాడు జిల్లా కమిటీ ఎన్నిక


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా మాలమహానాడు కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ సమక్షంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా బోగ వెంకటగిరి, డాక్టర్ బెంజిమెన్, కార్యదర్శిగా నరేష్, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జనార్దన్ జిల్లా యువత అధ్యక్షులుగా అశోక్‌తేజలను ఎన్నుకున్నారు. మాలల మల్ల యుద్ధ భేరీ సభ కాకినాడలో నిర్వహిస్తున్నామన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

- వెంకటపూర్‌లో రేకుల షెడ్డు కూలి రెండు దూడలు మృతి
- వందల ఎకరాల్లో నేలరాలిన వరి
- మామిడి కాయలు రాలి రైతు కన్నీరు


జన్నారం: వెంకటపూర్‌లో నేలకొరిగిన వరి పంట వద్ద రైతులు

జన్నారం: జన్నారం మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. అన్నదాతకు తీరని నష్టం మిగిల్చింది. జన్నారం మండలం వెంకటపూర్ గ్రామంలో గొల్లపెల్లి రాజన్న, రమేశ్‌లకు చెందిన 15 ఎకరాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. మల్లయ్యకు చెందిన ఆవుల మందకు అమర్చిన రేకుల షెడ్డు గాలికి కూలిపోయింది. రేకులు ఎగిరిపోయాయి. దీంతో రేకుల షెడ్డులోని రెండు దూడలు మృతిచెందగా పలు ఆవులు గాయాలపాలయ్యాయి. అదే విధంగా పొనకల్, జన్నారం, కవ్వాల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం వర్షాలకు తడిసిపోయింది. మామిడికాయలు రాలిపోయాయి. గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేసి రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వీబీఏ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంట నష్టంపై అంచనా వేస్తున్నారు.

**ఈదురుగాలులకు మామిడి పంటకి నష్టం**


భీమారం: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఆర్కెపల్లిలో నష్టం ఎక్కువగా ఉందని రైతులు సందెల తిరుపతి, మల్లయ్య తెలిపారు.


జన్నారం: మృతి చెందిన దూడలు


జన్నారం: తడిసిన వరి ధాన్యం


భీమారం: నేలరాలిన మామిడి కాయలు

# అమరుల స్మారక చిహ్నానికి 33ఏళ్లు


బెల్లంపల్లిలో అమరుల స్మారక స్తూపం

బెల్లంపల్లి: బొగ్గు గనుల క్షేత్రమైన బెల్లంపల్లికి విప్లవ, కార్మిక ఉద్యమాల చరిత్రకు పెట్టింది పేరు. ఉవ్వెత్తున ఎగిసి పడ్డ విప్లవ పోరాటంలో ఎందరో సింగరేణి కార్మికుల బిడ్డలు ఆకర్శితులై త్యాగాల బాటపట్టారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వీడే వరకూ పోరాడి అమరులయ్యారు. ఆ అమర వీరుల జ్ఞాపకార్థంగా బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియా టేకుల బస్తీ ప్రాంతంలో ప్రధాన రహదారిని అనుకుని నిషిద్ధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస), పీపుల్స్‌వార్ నేతృత్వంలో అమరుల స్మారక స్తూపాన్ని నిర్మించారు. 1990 ఏప్రిల్ 22వ తేదీన విప్లవ రచయిత వరవరరావు నేతృత్వంలో అమరుల తల్లిదండ్రులతో ఈ స్తూపాన్ని ఆవిష్కరింపజేశారు. ఆ స్తూపానికి నేటితో సరిగ్గా 33 ఏళ్లు నిండాయి.

**విప్లవ బీజాలు నాటిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం..**

సింగరేణి కార్మికుల బిడ్డలు పెద్ది శంకర్, గంగారాం విద్యార్థి దశలో రాడికల్స్ కార్యకలాపాలకు ఆకర్శితులయ్యారు. ఉన్నత చదువులు చదువుతూనే విప్లవాన్ని జీవితాశయంగా మార్చుకుని అజ్ఞాతంలోకి వెళ్లారు. సింగరేణి కార్మికులు, కర్షకులు, మహిళలు, రైతు కూలీలు, విద్యార్థి, యువజనుల సమస్యలపై, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజాఉద్యమాలను నిర్మించారు. అడవిబాట పట్టిన పెద్ది శంకర్ 1980 నవంబర్ 2న మహారాష్ట్రలోని సిరోంచలో జరిగిన పోలీసు ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు. బెల్లంపల్లి విప్లవోద్యమ చరిత్రలో తొలి అమరుడుగా పెద్ది శంకర్ పేరు చరిత్ర పుటల్లో నిలిచింది. వరంగల్ – కరీంనగర్ జిల్లాల్లోని సరిహద్దు అటవీ ప్రాంతంలో హ్యాండ్ గ్రెనేడ్లను తయారు చేసి పరీక్షిస్తున్న క్రమంలో చేతిలో గ్రెనేడ్ పేలి 1981 సెప్టెంబర్ 8న గజ్జెల గంగారం తుది శ్వాస విడిచాడు. ఆ ఇద్దరు అమరులు నాటిన విప్లవ బీజాలు క్రమంగా మొలకెత్తి బెల్లంపల్లిలో ఉవ్వెత్తున విప్లవ జ్వాలలు ఎగిసి పడేలా చేశాయి.

**ఆ అమరుల పేరుతో స్మారక స్తూపం**

విప్లవ పోరాటంలో అమరత్వం పొందిన వీరుల పేరుతో స్మారకస్తూపాన్ని ఆవిష్కరించారు. తొలి అమర వీరులు గజ్జెల గంగారం, పెద్ది శంకర్‌లతో పాటు, పులి మధునయ్య, ముద్దు నారాయణ, షంషీర్ ఖాన్, నంది రవీందర్‌రెడ్డి, రామగుండం ఓదెలు, కలువల సారయ్య, నాగనవేణి పొల్లుణ, మంతెన వెంకటేశ్వర్లు పేర్లను స్మారక స్తూపంపై లిఖించారు.

# ఉన్నత లక్ష్యాలతో పని చేయాలి


సర్టిఫికెట్లతో విద్యార్థులు

- ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు

శ్రీరాంపూర్: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడం కోసం కష్టపడి పనిచేయాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు తెలిపారు. సీసీసీలోని సింగరేణి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ సెర్మనీ, కేరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన జరుగుతుందన్నారు. అనంతరం డైట్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రప్రకాశ్‌రెడ్డి, జవహర్ బాబులు విద్యార్థుల కేరీర్‌పై అవగాహన కల్పించారు. టెన్త్ తరువాత ఎలాంటి చదువులు చదివితే భవిష్యత్తు ఉంటుందో వివరించారు. పూర్వ విద్యార్థులు రాజా రెడ్డి, కే.వాణిశ్రీలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు రోబ్, క్యాప్‌లు అందజేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్‌రావు, హెడ్‌మాస్టర్ శ్రీనివాస్‌రావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి దొనికెన మస్మయ్య, కోశాధికారి డప్పు సమ్మయ్య, ఉపాధ్యక్షులు కే శ్యాంసుందర్‌రెడ్డి, సభ్యులు టీ శంకర్, జక్కుల మల్లేశ్, కే తిరుపతి, సురేందర్, నల్ల సంపత్, కుమారస్వామి, గోసిక మనోజ్, ఇరుకుల్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

### ఏకలవ్య మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఆదర్శ్‌వర్ధన్ రాజు

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో ఏకలవ్య మోడల్ స్కూల్‌ను ప్రారంభించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు కోరారు. శుక్రవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో కేంద్ర ఫిషరీస్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌వర్ధన్ రాజు మాట్లాడుతూ... బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో దళితులు, గిరిజనులు అత్యధిక మంది ఉన్నారని అన్నారు. వీరి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఏకలవ్య మోడల్ స్కూల్‌ను మంజూరు చేసి ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ శ్రేణులు కొయ్యడ రవికుమార్, చిలుముల సాయి కుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

# కారుణ్య నియామకపత్రాలు అందజేత


కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏరియా జీఎం మోహన్ రెడ్డి 12 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగంలో చేరిన వారు సంస్థ నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని అన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ పీవో సత్యబోస్ యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

**శ్రీరాంపూర్‌లో..**

శ్రీరాంపూర్: గత వర్షాకాలంలో దొహెగాం వరదల్లో చిక్కుకున్న గర్భిణిని రక్షించబోయి మృతి చెందిన అంబాల రాము(ఆర్కే 5) అనే రెస్క్యూ సభ్యుడి కుటుంబానికి కంపెనీ కారుణ్య నియామకం అందించింది. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు చేతుల మీదుగా రాము భార్య స్పందనకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రం అందించారు. కంపెనీ వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా రక్షణాధికారి కే వెంకటేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి వెంగళ కుమారస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్; సీనియర్ పీఓ కాంతారావు, ప్రకాశ్‌రావు, రణదీప్‌గౌడ్, జీఎం కార్యాలయం ఫిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.

**ఉత్పత్తి సాధనలో భాగస్వామ్యం కావాలి**

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్య సాధనలో ఉద్యోగులంతా అంకితభావంతో పని చేసి భాగస్వామ్యం కావాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయ ఆవరణలో ఆరుగురికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, పర్సనల్‌మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

## రేపు 'చలో హైదరాబాద్'

మంచిర్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్‌లో ఈ నెల 22న నిర్వహించే బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖారావంను విజయవంతం చేయాలని తెలంగాణ బహుజన విద్యుత్ ఉద్యోగ ఆర్టిజన్ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తెన శివ శేఖర్ అన్నారు. శుక్రవారం పాత మంచిర్యాలలోని ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖరావం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూక్యా రాజు, ప్రచార కార్యదర్శి నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో ముగ్గురి అరెస్ట్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాలబస్తీలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈనెల 17న నవవధువు అపరాధ ప్రవళిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా మృతురాలి తల్లిదండ్రులు తోట లలిత, మల్లయ్య అదనపు వరకట్నం తీసుకు రావాలని అత్తారింటివారు వేధించడంతో తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రవళిక ఆత్మహత్యకు కారకులైన భర్త అపరాధ సతీష్, అత్తమామ లక్ష్మీ అలియాస్ మణెమ్మ, సారయ్యలతో పాటు ఆడబిడ్డలు సుమలత, కావ్యలపై కేసు నమోదైంది. శుక్రవారం మృతురాలి భర్త, అత్త మామలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ పంతాటి సదయ్య తెలిపారు.

## మద్యం మైకంలో యువకుడి ఆత్మహత్య


శేఖర్ (ఫైల్)

కోటపల్లి: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొల్లూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్‌పల్లి శేఖర్ (35), లక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. గురువారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శేఖర్‌ను భార్య మందలించింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిన శేఖర్ పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ తెలిపారు.

**మద్యం మత్తులో మరో యువకుడు..**


కిరణ్‌గౌడ్(ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామానికి చెందిన గట్టు కిరణ్‌గౌడ్(22) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... కిరణ్‌గౌడ్ చెన్నూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కిరణ్‌గౌడ్ మద్యానికి బానిసయ్యాడు. రోజులాగే గురువారం అర్ధరాత్రి మద్యం తాగి ఇంటికి రాగా తాగద్దని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికిలోంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తండ్రి బాపాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

## బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

దండేపల్లి: బైక్ ఢీకొని మండలంలోని మాదాపూర్‌కు చెందిన మేక రామయ్య (60) గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ వివరాల ప్రకారం.. రామయ్య మేదరిపేట పెట్రోల్ బంక్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి ఇంటి నుంచి సైకిల్‌పై పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా మాదాపూర్ వాటర్ ట్యాంక్ సమీపంలో కొత్తమామిడిపల్లికి చెందిన రాజు బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. రామయ్య తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు.. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పంపు సెక్షన్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ పంపు సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లోని వేతనాలను వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పంప్ సెక్షన్‌లో సుమారు 20 మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని సింగరేణి అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. దీంతో కుటుంబాలను పోషించుకునేందుకు కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రతి నెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లించాలనే చట్టాలు చెబుతున్నప్పటికీ నెలలు గడుస్తున్న కార్మికుల చేతికి వేతనాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికులకు వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజేష్, కార్మికులు రమేష్, రాజేశ్వర్, కిరణ్, సురేష్, శ్రావణ్, అత్తిరాం, మల్లయ్య, శ్రీకాంత్, రాజేష్, సాయి, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.